## పెంచిన పన్నులను రద్దు చేయాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఎడిపి సర్వే పేరుతో పెంచిన పన్నులను రద్దు చేయాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ మేయర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాకా సురేష్, సుబ్బారెడ్డి, సూర్యనారాయణ మాట్లాడుతూ ఎడిపి సర్వే పేరుతో నగరపాలక సంస్థ అధికారులు ఇష్టానుసారం ఇంటి పన్ను వేస్తున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదని ఎన్ని సార్లు చెప్పినా వినడం లేదన్నారు. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తూ సర్వసభ్య సమావేశంలోనూ తీర్మాణం చేశామని తెలిపారు. 3 నెలల్లో కడప ప్రజలపై రూ.20 కోట్లు అసెస్మెంట్ పెంచి పన్నులు వేశారని పేర్కొన్నారు. గతంలో ప్రజలకు మేలు జరిగేలా చేసిన తీర్మానాలు అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు వచ్చే వరకు ఎడిపి సర్వే నిలపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి కమిషనర్ రాఖేజ్ చంద్రకు వినతిపత్రం సమర్పించారు.

# మృత్యువులోనూ వీడని స్నేహ బంధం

చివరి సారిగా రిజర్వాయర్ వద్ద సెల్ఫీ దిగుతున్న స్నేహితులు

- తెలుగుగంగ రిజర్వాయలో పడి ముగ్గురు యువకులు మృతి
- చివరి సారిగా రిజర్వాయర్ వద్ద సెల్ఫీలు
- ముగ్గురూ ప్రొద్దుటూరు పట్టణ వాసులే
- మూడు కుటుంబాల్లో విషాదం

**ముగ్గురు స్నేహితులు సరదా గడుపుదామని దువ్వూరు మండలం చల్లబసాయపల్లె సమీపంలోని తెలుగు ప్రాజెక్ట్ సబ్సిడీ రిజర్వాయర్ - 1 వద్దకు వెళ్లారు. నీటిలో దిగేముందు చివరిసారిగా సెల్ఫీలు కూడా తీసుకున్నారు. తరువాత ముగ్గురు ఒకేసారి నీటిలో దిగ్గారు. ఒక్కసారిగా నీటిలో మునిగి గల్లంతయ్యారు. మరుసటి రోజు వారు విగత జీవులుగా కన్పించారు. సరదాగా విహార యాత్రకు వెళ్లిన ముగ్గురు స్నేహితులు చనిపోవడంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. మృత్యువులోనూ తమ స్నేహం బంధాన్ని కొనసాగించారని పలువురు పేర్కొంటున్నారు. జలాశయం వద్ద వారి బంధువుల రోధన, ఆర్తనాదాలతో నిండిపోయింది. ఈ సంఘటన దువ్వూరు మండలంలో చోటు చేసుకుంది. దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు, మైదుకూరు సిఐ మస్తాన్ అందించిన సమాచారం మేరకు..**

విగత జీవులుగా మారిన ముద్దాపీర్, రహమతుల్లా, షాహిద్

మృత్యుకుహరంగా మారిన తెలుగుగంగ జలాశయం-1

**ప్రజాశక్తి - దువ్వూరు (చాపాడు)**

ప్రొదుదూరు పట్టణం పవర్‌హౌస్ రోడ్డుకు చెందిన ఎస్.కె.ముద్దా పీర్ (22), మౌలానా ఆజాద్ వీధికి చెందిన పి. రహమతుల్లా (23), సుంద రాచార్యుల వీధికి చెందిన వి. షాహిద్ (23) ముగ్గురు స్నేహితులు. వీరు ఆదివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు దువ్వూరు మండలం తెలుగు గంగ ప్రాజెక్టు సబ్సిడీ రిజర్వాయర్-1 వద్దకు వెళ్లారు. ముగ్గురు యువకులు సెల్ ఫోన్‌లో సెల్ఫీ ఫొటోలు దిగారు. అనంతరం జలాశయంలోకి ఈత కోసం దిగారు. కొద్దిసేపటి తరువాత వారు గల్లంతయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు విషయం బయటపడింది. గట్టుపై దొరికిన సెల్‌ఫోన్లు, పర్సుల ఆధారంగా వారు ప్రొద్దుటూరుకు చెందిన వారిగా గుర్తించారు. గల్లంతైన యువకుల కోసం అగ్నిమాపక సిబ్బంది సాహాకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. వీరిలో రహంతుల్లా ప్రొద్దుటూరులో బిఫార్మసి మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాహిద్ ప్రొద్దుటూరులోనే మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మరో యువకుడు ముద్దాపీర్ తిరుపతి అమర్‌రాజా ఫ్యాక్టరీలో అప్రెంటీస్‌గా పని చేస్తున్నాడు. కాగా ముద్దాపీర్, షాహిద్ తండ్రులు గతంలో చనిపోయారు. రహమతుల్లా తండ్రి ప్రొద్దుటూరు ఆర్ట్స్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. దువ్వూరు ఎస్ శ్రీనివాసులు, మైదుకూరు సిఐ మస్తాన్ ఘటనపై కేసు నమోదు చేసి ముగ్గురు యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు యువకులు స్నేహితులు కావడంతో వారి కాలనీల్లో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న మృతుల బంధువులు జలాశయం వద్దకు చేరుకుని బోరున విలపించారు. జలాశయం వద్ద ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు లేవని, భద్రత ఏర్పాట్లు లేవని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జలాశయం వద్ద విహారయాత్రకు వచ్చే వారి పట్ల బాధ్యతగా వ్యవహరించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

# ఇసుకను సజావుగా పంపిణీ చేయాలి

**- కలెక్టర్ శివశంకర్ లోతేటి**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

**ప్రజాశక్తి - కడప**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇసుక పంపిణీ విధానం జిల్లాలో సజావుగా, సులభతరంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిఎల్ఎస్ సి) సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ తోపాటు ఎస్పి హర్షవర్ధన్ రాజు, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఎస్పి వెంకట్రాముడు, డిటిసి మీరా ప్రసాద్, మైన్స్ డిడి రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని, స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుక రేట్స్‌ను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఉచిత ఇసుక పంపిణీ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ఇసుక నిర్వహణ ఛార్జీలను మాత్రమే తీసుకుంటోందని, ప్రజలపై ఎలాంటి పన్ను భారం మోపడం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో గండికోట రిజర్వాయర్ తీర ప్రాంతాలైన కొండాపురం మండలంలోని చిత్రావతినదీ పరివాహకంలో కొత్తగా గుర్తించిన పి.అనంతపురం/నేంద్రపేట, ఏటూరు, ఏ. సుగమంచి పట్నం, ఓబన్న పేట డిసిల్టేషన్ పాయింట్ల నుండి ఇసుక ఇసుక సేకరణకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ పాయింట్లలో మొత్తం 5,27,850 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. జిల్లాలోని అన్ని స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి కొరత లేకుండా సులభతరంగా ఇసుక రవాణా జరిగేందుకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడూపర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఇసుక రీచ్‌లను సంబంధిత అధికారులు తరచుగా పరిశీలించాలన్నారు. నూతన ఇసుక విధానం ప్రకారం నిర్దేశించిన నియమ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. డివిజన్ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు, మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ఆర్‌డిఒలు, డిఎస్‌పిలను ఆదేశించారు. ఎస్‌పి మాట్లాడుఊత ఇసుక అక్రమ రవాణాకు ఏ మాత్రం అవకాశం లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గట్టి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని స్టాకు పాయింట్లు, ఇసుక రీచుల వద్ద సిసికెమెరాల ద్వారా నిఘా పర్య వేక్షణను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఒ ప్రభాకర్ రెడ్డి, ఆయా రెవెన్యూ డివిజన్ల నుంచి ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాహితీ జ్ఞానపీఠాన్నధిష్టించిన మహాకవి 'సినారె'

**- ఆచార్య టి.రామప్రసాదరెడ్డి**

**ప్రజాశక్తి- కడప అర్బన్**

తెలుగు సాహిత్యంలో వందకుపైగా రచనలు చేసి సాహితీ జ్ఞానపీఠాన్నధిష్టించిన మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సోమవారం సి.కె.సంపత్‌కుమార్ పఠన మందిరంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి 94వ జయంతిని నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి డాక్టర్ సి.నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.నారాయణ రెడ్డి పరిశోధించి రచించిన 'ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు, ప్రయోగాలు' అనే గ్రంథం గొప్ప ప్రామాణిక గ్రంథంగా సాహితీ చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంతో సినారెకు చాలా అనుబంధం ఉందని చెప్పారు. బ్రౌన్ పరిశోధన కేంద్రానికి 1998లో ఒకసారి, 2003లో మరోసారి రావడమే కాక రాజ్యసభ సభ్యులుగా ఆయన తన నిధుల నుండి రెండవ అంతస్తుకు రూ.10 లక్షలు ఇచ్చారని అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ సినారె ప్రాంతీయ భేదం లేని కవి అని, 'తెలుగు జాతి మనది, నిండుగ వెలుగుజాతి మనది' అనే పాటతో ఆయన ఆ విషయాన్ని స్పష్టం చేశారని అన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది హరి, అరుణమ్మ, పాఠకులు అనిల్ కుమార్, శ్రీకాంత్, సురేష్, సుబ్బయ్య, రేవంత్, రమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎన్‌జిఒలకు జ్ఞాపికను అందజేస్తున్న సేవా సమితి నిర్వాహకులు

## 'వరద ఆది' సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి - కడప :** వరద ఆది సేవా సమితి అందిస్తున్న సేవలు అభినం దనీయమని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ కేశవరెడ్డి అన్నారు. సోమవారం కడప నగరంలో బాసట చిల్డ్రన్ హోమ్‌లో వరద ఆది సేవా సమితి మొదటి వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ పాల్గొని మాట్లాడారు. సేవా సంస్థ ప్రారంభించిన సంవత్సరంలోనే వంద అన్నదాన కార్యక్రమాలు పూర్తి చేయడం చాలా ఆనందించాల్సిన విషయం అని అన్నారు. బాసట చిల్డ్రన్ హమ్ వ్యవస్థాపకులు డి.కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ వరద ఆది సేవా సమితి భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ పాఠశాల అధికారి విశ్వనాథరెడ్డి, వరద ఆది సేవా సమితి అధ్యక్షుడు బ్రహ్మయ్య యాదవ్, కిరణ్ యాదవ్, కిషోర్ యాదవ్, పొలతల రామచంద్రయ్య యాదవ్, ఈశ్వరయ్య, మీకోసం విష్ణు వర్ధన్, పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలి

**ప్రజాశక్తి - కడప :** నగరంలోని శ్రీహరి డిగ్రీకళాశాలలో సోమవారం 'హెల్మెట్ ధరించండి ప్రమాదాలను నివారించండి' అంశంపై జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలని అన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చునని చెప్పారు. రైడర్, వారి ప్రయాణీకుడు ఇద్దరూ హెల్మెట్‌లను ధరించాలి అన్నారు. సెక్షన్ 194 డిఎంవి యాక్ట్ హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ. 1000 వరకు జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ మూడు నెలల పాటు రద్దు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీహరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**ప్రజాశక్తి - కడప సిటీ**

ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ పేర్కొన్నారు. సోమవారం కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎన్ఎ ఎస్ఎస్ యూనిట్ కడప ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి చెట్ల ప్రాముఖ్యతను తెలియజేసి, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు దాసరి, వైద్య విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ భాగస్వాములు కావాలని ఎంఇఒ- 2 ఇర్షాద్ అహ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం ఎన్ఇపి డే సందర్భంగా శిక్ష సప్తహ్ కార్యక్రమం అక్కాయిపల్లిలోని ఉర్దూ పాఠశాలలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజూ పాఠశాలకు రావాలని చెప్పారు. అనంతరం తిథి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెడ్ టీచర్ షేక్. నజీబుల్లా, సాదిక్ అలీ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సల్మా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మొదటి రోజు కౌన్సెలింగ్‌కు విశేష స్పందన

**ప్రజాశక్తి - కడప అర్బన్**

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియకు విద్యార్థుల నుంచి స్పందన లభించిందని యూనివర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఆచార్య జి. విశ్వనాథ కుమార్ పేర్కొన్నారు. ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏడసెట్)- 2024 కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించారు. క్యాంపస్‌లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం ఒక్కరోజే 50 మంది పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందారు. బిఎఫ్ఎ పెయింటింగ్, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్, శిల్పం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. రాష్ట్రం నుంచే కాకుండా రాష్ట్రాల నుంచి విద్యార్థులు ప్రవేశాల కోసం రావడం విశేషమన్నారు. కార్యక్రమంలో వైవీయూ సహ ఆచార్యులు ప్రొఫెసర్ వై. సుబ్బరాయుడు, ప్రొఫెసర్ విజయ లక్ష్మి,ఇంచార్జి రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

**ప్రజాశక్తి- కడప అర్బన్**

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో 4వ,6వ,8వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి విసి ఆచార్య జి.విశ్వనాథ కుమార్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య రాజేష్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ 4వ సెమిస్టర్ 93 శాతం, 6వ సెమిస్టర్ 60 శాతం,8వ సెమిస్టర్ 75 శాతం, అలాగే కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ సంబంధించిన రెండవ సెమిస్టర్ 70శాతం మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్ సైట్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్ర రెడ్డి, ఉదయ ప్రకాష్ రెడ్డి, లక్ష్మీ ప్రవళిక పాల్గొన్నారు.

## ఎస్‌టియు జిల్లా మహిళా కమిటీ కన్వీనర్‌గా కవిత

**ప్రజాశక్తి-కలసపాడు :** రాష్ట్రోపాధ్యాయసంఘం(ఎస్‌టియు) కడప జిల్లా మహిళా కమిటీ కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయురాలు పి.జె.పి.కవిత నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం స్థానిక బాలికోన్నత పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయు రాష్ట్రఅదనపు ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమాలలో మహిళల పాత్ర తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో కవిత లాంటి వారు ముందుకు రావడం అభినందనీ యమన్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆమెను ఎస్‌టియు నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎన్.వి.ప్రసాద్, జిల్లా కార్యవర్గసభ్యులు శేఖర్ బాబు, సత్యనారాయణ, శివారెడ్డి, మండల కార్యవర్గసభ్యులు సలోమి సత్యవతి, మహబూబ్ చాంద్, విజయభాస్కర్ రెడ్డి, వీరారెడ్డి ,గురుప్రసాద్ పాల్గొన్నారు.

## పందులను గ్రామాలకు దూరంగా పెంచుకోవాలి

**ప్రజాశక్తి-చెన్నూరు :** మండలంలోని గ్రామాలకు దూరంగా పందులను పెంచుకోవాలని ఎ అధికారులు పందుల పెంపకం దారులను హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ, విస్తరణ అధికారుల సమక్షంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి సర్పంచ్‌లు పందుల పెంపకం దారులతో సమావేశం నిర్వహింవచారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పందుల పెంపకం దారులు గ్రామాలకు దూరంగా, తగు జాగ్రత్తలతో పందుల పెంపకం చేపట్టాలని వారికి తెలియజేశారు. పందులు గ్రామాలలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇటీవల పలు వార్తాపత్రికల్లో పందుల స్వైర విహారం వంటి వార్తలు ప్రచురితం కావడంతో స్థానిక అధికారులు పందుల పెంపకం దారులతో సమావేశం ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు సూచనలు ఇచ్చారు.

## విఆర్‌ఎలకు నైట్ వాచ్‌మెన్ విధులు దుర్మార్గం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** సిద్ధపటం మండలంలోని తహశీల్దార్ విఆర్‌ఎలను నైట్ వాచ్‌మెన్ విధులు నిర్వహించాలని ఆదేశించడం దుర్మార్గమని, అలాంటి ఆదేశాలను రద్దు చేయాలని విఆర్ఎల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కాలంలో విఆర్ఎలు చేసిన పాత్ర గొప్పదని పేర్కొన్నారు. అయినప్పటికీ చాలామందికి ఎన్నికల కాలంలో పనిచేసిన వారికి డబ్బులు రాలేదని తెలిపారు. ఇప్పుడు సిద్ధవటం మండలం తహశీల్దార్ విఆర్‌ఎలను వాచ్‌మెన్‌గా చేయాలని, లేకపోతే ఇబ్బందులు తప్పవని భయాందోళనకు గురిచేయడం అన్యాయమన్నారు. వారి ఇచ్చే వేతనం చాలా తక్కువని, అర్హులైన వారిని వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్స్, విఆర్‌ఒలుగా ప్రమోషన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. కానీ అలాంటి పని చేయకపోగా నైట్ వాచ్‌మెన్‌గా విధులు చేయాలని ఇచ్చిన ఆర్డర్లను తహశీల్దార్ వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఈ విష యాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## మినుము పంట పరిశీలన

**ప్రజాశక్తి-చెన్నూరు**

మండలంలోని ముళ్ళపల్లి గ్రామంలో రైతులు సాగుచేసిన మినుము పంటను మండల వ్యవసాయ అధికారి.కె. శ్రీదేవి, అగ్రికల్చర్ అధికారి సి. ఇందిరా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి రైతులకు పలు సూచనలు చేశారు. పంటలో మచ్చల పురుగు ఉధృతి ఉందని, నివారణ కోసం 35 రోజుల వయసు ఉన్న పంటకు ముందు జాగ్రత్తగా ఐదు మీల్లీ మీటర్ల వేప నూనను ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. మొగ్గ పూత దశలో ఉన్నప్పుడు పిల్ల పురు గులు ఆశించే అవకాశం ఉందని, వెంటనే పురుగు ఉన్న పూలు కాయలు చేతితో ఏరువేసి వాటిని నాశనం చేయాలన్నారు. నివారణకు ద మోడీ కార్బో ఒక లీటర్ నీటితో ఎసి పెట్ లీట రు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పొలం గట్ల వెంబడి కలుపు మొక్కలను తొలగించారని పేర్కొన్నారు. నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సిబ్బంది స్వర్ణ, రైతులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1.73 లక్షలు

**ప్రజాశక్తి - చింతకొమ్మ దిన్నె :** మండలం పరిధిలోని కొత్తపేట గ్రామంలో వెలసిన గంగమ్మ దేవ స్థానం ఆయల హుండీని సోమవారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 1, 73, 790 వచ్చిందని ఆలయ ఈవో సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. జూన్ నెల 10 నుంచి ఈనెల వరకు ఆదాయాన్ని లెక్కించామన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు

## అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముక్కు పుడక సమర్పణ

**ప్రజాశక్తి- చెన్నూరు :** మండలంలోని గోపవరం సమీపంలో కాశీపురం పుష్పగిరికి వెళ్లే రహదారిలో వెలసిన శ్రీ శ్యామల మాతాంగి దేవి అమ్మవారికి వైసిపి నియోజకవర్గ స్టూడెంట్ వింగ్ ప్రధాన కార్యదర్శి గుమ్మల సాయి కుమార్ రెడ్డి, కుటుంబం తరుపున సోమవారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, అమ్మ వారికి రూ.20 వేలు విలువ చేసే బంగారు ముక్కు పుడకలు సమర్పించిచారు. ఈసందర్భంగా సాయికుమార్‌రెడ్డి మాటాడుతూ, పోచం రెడ్డి నరేన్ రామాంజులరెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు, ముక్కు పుకడలు అందజేశామన్నారు.

## విద్యార్థులకు తిథి భోజనం

**ప్రజాశక్తి-చెన్నూరు :** కొక్కరాయపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మాజీ ఎంపిటిసి వాసుదేవరెడ్డి శిక్షా సప్తహ్‌లో భాగంగా తిథి భోజనం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పిల్లలందరికీ మాంసాహార భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ-2 సునీత మాట్లాడుతూ పేద పిల్లలకు ఒక రోజు రుచికరమైన ఆహారం అందించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు దాత వాసుదేవరెడ్డి తిథి భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డిని అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత, వీరనారాయణ, సిఆర్‌ఎంటి విజయమ్మ, సూరి, లక్ష్మణ్, రవి ,గురయ్య సుగుణమ్మ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా క్రికెట్ మ్యాచ్‌లు

**ప్రజాశక్తి - కడప**

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ -19 గ్రూపు బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ లో మ్యాచ్‌లు రసవత్తరంగా జరుగుతున్నాయి. వైఎస్ రాజారెడ్డి ఏసిఎ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో 8 వికెట్ల నష్టానికి 370 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కృష్ణా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 97.2 ఓవర్లలో 396 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని వరుణ్ సాత్విక్ 158 పరుగులు (సెంచరీ) చేశాడు. మరో బ్యాట్‌మెన్ బి. గీత్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 103 పరుగులు (సెంచరీ) చేసి నాట్ అవుట్ గా నిలిచారు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ డి బాలాజీ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 81.0 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 331 పరుగులు చేసింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 75, చరణ్జిత్ 60, గౌతమ్ కృష్ణ 93 (నాట్ అవుట్) పరుగులు చేశారు. కృష్ణా జట్టులోని రాజేష్ 3 వికెట్లు తీసుకున్నాడు. **భారీ స్కోరు దిశగా కడప జట్టు** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో గురు చరణ్ సెంచరీ చేయడంతో కడప జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. 2 వికెట్ల నష్టానికి 132 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 116.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 452 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టులోని ఎన్. గురు చరణ్ బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించాడు. 243 బంతులను ఎదుర్కొని 23 బౌండరీల సహాయంతో 147 పరుగులు (సెంచరీ) చేశాడు. ఆర్. రోహిత్ 82 పరుగులు చేశాడు. శ్రీకాకుళం జట్టులోని జున్నారావు 3, ఎం. సుశాంత్ 2, పూర్ణ 2 వికెట్లు తీసుకున్నారు.

## భూ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కలసపాడు :** మండలంలో నెలకొన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాజుపాలెం గ్రామానికి చెందిన పామూరు బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఆయన వన్ బి అడంగల్, ఎస్సార్, సర్వే నెంబర్లు భూములకు సంబంధించినటువంటి సమాచారాన్ని ఇవ్వాలని తహశీల్దార్‌ను కోరారు. మండలంలో భూ సమస్యలు చాలా ఉన్నాయని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మురళీధర్ రెడ్డి, డిప్యూట తహశీల్దార్ నాగేంద్ర, ఇఒపిఆర్‌డి మురారి, ఎపిఒ శివ శంకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి షరీఫ్, ఎపిఎం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## రేషన్ షాపులు ప్రారంభం

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసే రేషన్ షాపులను ఎమ్మెల్యే మాధవి సోమవారం నగరంలోని వివిధ డివిజన్లో ప్రారంభించారు. నగరంలోని మేకల దొడ్డి, రామాంజనేయపురం, చలమారెడ్డిపల్లె, ఆర్కేనగర్‌లో రేషన్ షాపులను లబ్ధిదారులకు కేటాయించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ మాసపత్రిక ఆవిష్కరణ



మాసపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాస పత్రికను కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ తెలంగాణ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, కడప జిల్లా మహిళా అధ్యక్షులు అంకిరెడ్డి మేరీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు డాక్టర్ జుల్ఫికర్, కడప జిల్లా ఎడ్యుకేషనల్ డైరెక్టర్ జ్యోతి విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

## గండి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

శ్రావణమాసంలో జరిగే గండి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం గండి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి స్వామితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆగస్టు 5వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కిరణ్ రాయల్, పోతిరెడ్డి శివ, హేమిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరిస్తాం : ఎమ్మెల్సీ**

**పులివెందుల రూరల్ :** ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రజల వినతులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. మరికొన్నిటిని పరిష్కరించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ప్రజాదర్బార్‌లో యువత తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కొంతమంది తమకు పెన్షన్లు అందలేదని ఎమ్మెల్సీకి వివరించారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**ప్రజాశక్తి - మైదుకూరు**

విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఏదైనా బ్యాంకులో రూ.20 ఇన్సూరెన్స్ చేయడం ద్వారా రూ.2 లక్షల ప్రమాద బీమా, బ్యాంకులు కల్పిస్తున్న పథకాల గురించి వివరించారు. బ్రహ్మచారి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ ద్వారా సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయో, వాటిపట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలో వివరించారు. పీఎంజెజెబివై, ఏపీవై వంటి కార్యక్రమాల పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సి నరసింహారావు, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు వెన్నారాయుడు, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్ కోసం దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - చాపాడు**

మండలానికి 25 గోకులం షెడ్లు మంజూరయ్యాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్య అధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. రెండు పశువుల షెడ్డుకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువుల షెడ్డుకు రూ.1.85 లక్షలు, ఆరు పశువుల షెడ్‌కు రూ.2.30 లక్షలు మంజూరు అవుతుందన్నారు. రైతు వాటాగా 10శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గొర్రెలు, మేకల షెడ్లకు సంబంధించి ప్రభుత్వం 70శాతం మంజూరు చేస్తుందని, 30శాతం రైతులు వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. షెడ్ కావలసిన రైతులు దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, ఉపాధి జాబ్ కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, తహశీల్దార్ మంజూరు చేసిన స్థల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, లబ్ధిదారుని ఫొటోతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పశువులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

## చర్మ వ్యాధుల నివారణకు టీకాలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ఆవులు, ఎద్దుల సోకే లంపీ, ముద్ద చర్మ వ్యాధులను నివారించేందుకు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి వాసు శ్రీనివాస తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంపీ చర్మ వ్యాధి పశువులకు వచ్చే వైరల్ ఇన్ఫెక్షన్ అన్నారు. ఈ వ్యాధి వల్ల జ్వరం, కళ్ల నుంచి నీరు, నోటి నుంచి చొల్లు కారడం, చర్మం, ఇతర భాగాలపై నాడ్యూల్స్ కలిగి ఉంటాయన్నారు. ఈ నాడ్యూల్స్ బాగా చుట్టు ముట్టబడి గుండ్రంగా కొద్దిగా పైకి లేచి దృఢంగా, బాధాకరంగా ఉంటాయన్నారు. ఈ వ్యాధి వల్ల ఆవుల్లో మందగించిన పాల దిగుబడి తగ్గుతుందన్నారు. వ్యాధి నివారణకు టీకాలు వేయించాలన్నారు.

## 9న ఢిల్లీలో మాదిగల మహాధర్నా

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

మాదిగల ఆత్మగౌరవం కోసం జరపతలపెట్టిన చలో ఢిల్లీ మాదిగల మహా ధర్నా ఆగస్టు 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.సుధాకర్ మాదిగ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీలను ఎబిసిడిలుగా విభజిస్తామని, మాదిగ దండోరా సభలకు వచ్చి ఎస్సీలలో 59 కులాలు రిజర్వేషన్ సమాన పంపిణీ జరపాలని చెప్పిన బిజెపి పెద్దలు మాట తప్పారని తెలిపారు. పార్లమెంటు సమావేశాలు జరిగే సందర్భాల్లో వేలమంది మాదిగలు, మాదిగ ఉపకులాల ప్రజలు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి దేశ రాజధాని ఢిల్లీలో అనేక రూపాల్లో ధర్నాలు చేసినప్పటికీ ఫలితం లేదని వాపోయారు. చలో ఢిల్లీ మాదిగల మహా ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా భారీగా తరలివస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దిలేటమ్మ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

# రోడ్లపై మురుగు.. ప్రజలు బేజారు

### దోమలు, దుర్వాసనతో సతమతమవుతున్న స్థానికులు - అధికారులు స్పందించాలని వేడుకోలు

శ్రీరాం నగర్ ప్రాంతంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

**ప్రజాశక్తి - వేంపల్లె**

స్థానిక శ్రీరాం నగర్ ప్రాంతంలోని ఎరుకుల వీధిలో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. దోమలు విపరీతంగా వృద్ధి విపరీతంగా వృద్ధి చెందడంతో ఆ ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారు. శ్రీరాంనగర్ ప్రాంతంలో ఉన్న మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపై నదిలా పారుతోంది. ఇలాంటి రోడ్డుపై నడవాలంటే ప్రజలు హడలి పోతున్నారు. ఆ ప్రాంతంలోనే సర్పంచ్ కూడా నివాసం ఉంటున్నారు. సర్పంచ్ నివాసం ఉంటున్న ప్రాంతంలోనే పారిశుధ్యం అధ్వానంగా నెలకొంది. దోమల ఉత్పత్తి నిరోధించాలని ఓవైపు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు మురుగు, దోమల ఉత్పత్తి శ్రీరాంనగర్‌లో విజృంభిస్తున్నాయి. కాలువల్లో పూడిక తీసి అక్కడే వేయడం వల్ల మళ్లీ పందులు కాలువలోకి తోయడంతో.. కాలువలు పూర్తిగా మళ్లీ పూడికతో నిండిపోయాయి. దుర్వాసన కూడా భరించలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. మిట్ట ప్రాంతం నుంచి మురుగు కాలువలోని నీరు తగ్గు ప్రాంతంలోకి వచ్చి రోడ్డుపై ప్రవహిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. ప్రతి నిత్యం ప్రజాప్రతినిధులు ఆ రహదారి వెంట నడుస్తున్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదని అంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఇలాంటి ప్రాంతాలకు వెళ్లి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పంచాయతీ అధికారులు రోడ్డుపై మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలి. దోమల నివారణ కోసం బ్లీచింగ్ పౌడర్ ప్రతిరోజూ చల్లాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# చెరువులను నింపి రైతులు, ప్రజలను ఆదుకోండి

అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న రైతు నాయకులు

**ప్రజాశక్తి - మైదుకూరు**

కడప జిల్లాలో ఇప్పటివరకు సరైన వర్షాలు పడక జిల్లాలోని చెరువులన్నీ ఎండిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కెసి కెనాల్, తెలుగుగంగ కాలువల ద్వారా చెరువులను నీటితో నింపి రైతులను, ప్రజలను ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ కోరారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో సోమవారం ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. గతేడాది వర్షాలు లేక పూర్తి స్థాయిలో పంటలు పండించుకోలేక రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం కూడా ఇప్పటి వరకు సరైన వర్షాలులేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయిలో నిండినందున జిల్లాలోని కెసి కెనాల్, తెలుగు గంగ కాలువల ద్వారా చెరువులను నీటితో నింపి రైతులను ఆదుకోనే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు, రైతులు రామ్మోహన్, రాజా, రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, సంజీవ రాయుడు, నారాయణ, శేఖర్, అహమద్, కొమ్మూరి అజయ్, రాజన్న పాల్గొన్నారు.

**కెసి కెనాల్‌కు నీటి విడుదలపై ప్రకటన ఇవ్వాలి**

**ఖాజీపేట :** శ్రీశైలం జలాశయం 876 అడుగులకు నీరు చేరిన నేపథ్యంలో కెసి కెనాల్ నీటి విడుదలపై ప్రభుత్వం తక్షణం ప్రకటన చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వైసిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కోరారు. దుంపలగట్టులోని తన స్వగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీటి విడుదల ఆలస్యమైతే పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. నీటి విడుదలకు ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన పేర్కొన్నారు.

# బిల్లులు చెల్లించి, నిలిచిన పనులు చేపట్టాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లె పంచాయతీ పరిధిలో అర్ధాంతరంగా రోడ్డు పనులు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించి పనులను వెంటనే ప్రారంభించాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. సోమవారం అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, సిపిఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులపై రోడ్డు భవనాల శాఖ ఎఇ వెంకటరమణతో తులసిరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు విస్తరణ, అండర్ డ్రెయినేజీ పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి పను లు పునః ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్ రెడ్డి, సుబ్ర మణ్యం, బాలం సుబ్బరాయుడు, వేమా నాగరాజా, రామకృష్ణ, ఉత్తన్న, రవి, వెంకటేష్, వినయ్, మదార్, వేమయ్య, నాగరాజు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, సిపిఐ నాయకులు బ్రహ్మం, ఉత్తన్న, అమర్ పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డు పనులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

## ప్రతి కార్యాలయంలో కమిటీలు

**ప్రజాశక్తి - చాపాడు**

మహిళల రక్షణ కోసం ప్రతి కార్యాలయంలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ రహంతులయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ అధ్యక్షతన పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు అధికంగా జరుగుతున్నాయన్నారు. వాటిని నివారించడానికి ప్రభుత్వం నూతన చట్టాలను అమల్లోకి తెచ్చిందన్నారు. అందులో భాగంగా ప్రతి కార్యాలయంలో కమిటీలు ఏర్పాటు చేసి తద్వారా మహిళలపై వేధింపులు నిరోధానికి కృషి చేయాలన్నారు. ఈ కమిటీలో పురుషులు, మహిళలు సమానంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం కమిటీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు పట్ల సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ జిఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

## జంప్‌రోప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - చాపాడు**

అంతర్ జిల్లాల అండర్-12, 14 స్థాయి జంప్‌రోప్ ఛాంపియన్ పోటీల్లో మండల పరిధిలోని నరవరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మి నరసింహ శాస్త్రి తెలిపారు. నంద్యాలలో శని, ఆదివారాల్లో గ్లోబల్ పాఠశాలలో జంప్‌రోప్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో టీం విభాగంలో జ్ఞాన అక్షిత సాయికి, కే శివ చందనకు గోల్డ్ మెడల్, వ్యక్తిగత విభాగంలో శివచందన, మహేష్‌కు గోల్డ్ మెడల్, ధర్మతేజకు సిల్వర్ మెడల్, వెన్నెలకు బ్రాంచ్ మెడల్ వచ్చిందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రశాంతిని, విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

**ప్రజాశక్తి - మైదుకూరు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జగనన్న గోరుముద్ద (మధ్యాహ్నం భోజన పథకాన్ని) డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకంగా మార్చారు. ఆ మేరకు సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు కౌన్సిలర్ కూశెట్టి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కృష్ణా పురం ప్రాథమికోన్నత పాఠశాలలో తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల పరిధిలోని శెట్టివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక నాయకులు పొలిమేర శివశంకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో టి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

## కస్తూర్బా విద్యార్థులకు రక్త పరీక్షలు

**ప్రజాశక్తి - పెద్దముడియం**

వర్షాకాలం కావడంతో గ్రామాల్లో, విద్యాలయాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద పసుపుల కస్తూర్బా గాంధీ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు హెల్త్ సూపర్వైజర్ సోము వెంకటరమణ నేతృత్వంలో రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తహీనత, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంటలను పరిశీలించి ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వంట సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, ల్యాబ్ టెక్నీషియన్ శివనాథ్, ఆరోగ్య కార్యకర్త విజయమ్మ, ఆశ కార్యకర్త మహేశ్వరమ్మ, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ మౌనిక, ఆరోగ్య కార్యకర్త మేరీ పాల్గొన్నారు.

కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగిస్తున్న జెసిబి యంత్రం

## భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా రావాల్సిన పెండింగ్ క్లయిమ్‌ను మంజూరు చేసి వారిని ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. సోమవారం టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం జిఒ17ను జారీ చేసి వెల్ఫేర్ బోర్డు క్లయిమ్‌లను నిలిపేసిందన్నారు. బోర్డులో ఉన్న వేల కోట్ల నిధులు ఇతర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిందన్నారు. దీంతో దాదాపు 42 వేల క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొత్త సభ్యుల నమోదును కూడా నిలిపేసిందని వివరించారు. కూటమి ప్రభుత్వం దృష్టికి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, కార్మికులు పాల్గొన్నారు.

## రహదారికి ఇరువైపులా కంపచెట్లు తొలగింపు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండల పరిధిలోని పిచ్చపాటి పల్లెలో రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. కంపచెట్లతో రాకపోకలకు కష్టతరంగా ఉండేది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండేవారు. ఈ విషయమై గ్రామస్తులు స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఐ టిడిపి మండల అధ్యక్షులు పాపాన మల్లికార్జునరెడ్డి స్పందించి ఆయన తన సొంత ఖర్చులతో జెసిబి ఏర్పాటు చేసి రహదారికిరువైపులా ఉన్న కంపచెట్లను తొల గించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

హెల్మెట్ పంపిణీ చేస్తున్న మెజిస్ట్రేట్, సిఐ

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

**- మెజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మెజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సంయు గ్లాస్ యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం హెల్మెట్ వాడకంపై స్థానిక గాంధీ సర్కిల్ వద్ద నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ఉండడం వల్ల తలకు ఎలాంటి గాయాలు కావని పేర్కొన్నారు. చాలామంది ప్రజలు హెల్మెట్ లేక తలకు తీవ్ర గాయాలై మరణించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. పట్టణ సీఐ మోహన్ మాట్లాడుతూ హెల్మెట్‌లేని ప్రయాణం చట్టరీత్యా నేరమన్నారు. సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్స్ కిషోర్ కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రకాష్, సంయు గ్లాస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

భీమేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న రెవెన్యూ శాఖ సిబ్బంది

## భీమేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలి

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలను పొందిన తహశీల్దార్ భీమేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం బదిలీపై అన్నమయ్య జిల్లాకు వెళుతున్న తహశీల్దార్ భీమేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ శిరీష, ఆర్ఐ షేక్షావల్లి మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను సావధానంగా విని పరిష్కరించారన్నారు. బదిలీపై వచ్చిన అనతి కాలంలోనే మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. బదిలీపై వెళుతున్న భీమేశ్వరరావు మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో తనకు సహరించిన ప్రజా ప్రతినిధులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అనిత

## సేవా కార్యక్రమాలు అభినందనీయం

**ప్రజాశక్తి - చాపాడు**

సేవా కార్యక్రమాలకు సహకరించడం అభినందనీయమని నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్‌బాబు తెలిపారు. విద్యాశాఖ ప్రవేశపెట్టిన శుభదిన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఎన్.నాగభూషన్‌రెడ్డి, అనిత కుమార్తె ఆరాధ్య పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు భోజన వసతిని కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు భోజన వసతిని కల్పించడం సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఉపాధ్యాయులు కృష్ణయ్య, రాధమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలుర పాఠశాల విద్యార్థులకు తిథి భోజనం

**ప్రజాశక్తి - వేంపల్లె**

విద్యార్థులకు తిథి భోజనం పెడుతున్న పూర్వ విద్యార్థులు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయురాలు శివ మునెమ్మ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులతోపాటు బదిలీపై వెళ్లిన తెలుగు ఉపాధ్యాయురాలు కృష్ణవేణి సహకారంతో పాయసం, చిత్రాన్నం విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా శివ మునెమ్మ మాట్లాడుతూ 1979 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలిగి చక్కని విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. తిథి భోజనం పెట్టేందుకు ముందుకు వచ్చిన దాతలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విశ్వనాథరెడ్డి, సత్యం, భాస్కర్, అబ్దుల్ అజీజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహాదేవపల్లె హైస్కూల్లో కృష్ణగిరి రమేష్ ఆధ్వర్యంలో..

**ప్రజాశక్తి - చక్రాయపేట**

మండలంలోని మహాదేవపల్లె ఉన్నత పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సోమవారం అదే గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ బిసి నాయకులు కృష్ణగిరి రమేష్ తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతను ఎంఇఒ టి.రవి కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. ఇది మంచి కార్యక్రమమని ప్రశంసించారు. ఎంతో మందికి ఆదర్శం కావాలన్నారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు క్రమంగా శుభదిన్ భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు సురేంద్రరెడ్డి, శ్రీనివాసులు, గంగయ్య, వెంకటేశ్వర్లు, శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలకు అన్నం వడ్డిస్తున్న కృష్ణగిరి రమేష్